క్లుప్తంగా

సమ్మర్ స్పెషల్ క్యాంప్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పీయూలోని ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–4 సభ్యులు బుధవారం గండీడ్ మండలంలోని దేసాయిపల్లిలో సమ్మర్ స్పెషల్ క్యాంప్ నిర్వహించారు. గ్రామంలోని యువతకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. అందరూ చదువుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌డబ్ల్యూ, తెలుగు విభాగం హెచ్‌ఓడీ గాలెన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

టీ–సేవ్ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: హైదరాబాద్‌లో వైఎస్సార్ తెలంగాణ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన టీ–సేవ్ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మండడి సరోజ్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రం తెచ్చుకున్నది నీళ్లు, నిధులు, నియమకాల కోసమని అన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం ఉద్యోగాల కల్పనలో విఫలమయ్యారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంటికో ఉద్యోగం అంటూ యువతను మోసం చేశారని విమర్శించారు.

పరిశుభ్రతపై ప్రతిజ్ఞ

భూత్పూర్: మున్సిపాలిటీలోని 10 వార్డులను పరిశుభ్రంగా ఉంచాలనే ధ్యేయంగా బుధవారం ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. చైర్మన్ బస్వరాజ్ గౌడ్, కమిషనర్ నజీబ్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వేసవి నేపథ్యంలో సిబ్బందికి చైర్మన్ ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

చిన్నచింతకుంట: మండలంలోని బండ్రపల్లి సమీపంలో వెలసిన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడు రోజులపాటు పాటు నిర్వహించే ఉత్సవాలలో రెండో రోజు బుధవారం స్వామివారికి అష్టోత్తర కలశపూజ, గీతాయజ్ఞ, బ్రహ్మయజ్ఞం, అభిషేకం చేశారు. ఉత్సవాలకు చిన్నచింతకుంట, దేవరకద్ర మండలాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. స్వామి వారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

వీరన్నపేటలో అవగాహన

మహబూబ్‌నగర్ క్రైం: వన్‌టౌన్ పోలీస్ స్టేషన్, రైల్వే ఫోర్స్ ప్రొటెక్షన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని వీరన్నపేటలో ప్రజలకు పలు రకాల నేరాలపై అవగాహన కల్పించారు. రైలులో ప్రయాణం చేసే సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఇతర నేరాలపై స్థానికులకు వివరించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ స్వామిగౌడ్, ఆర్‌పీఎఫ్ సీఐ సురేందర్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

దేవరకద్ర రూరల్: ఉపాధి హామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి కూలీలకు వేతనాలు వారం రోజుల్లోనే అందజేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి సాంబశివుడు డిమాండ్ చేశారు. బుధవారం కౌకుంట్లలో ఉపాధి పనులు చేస్తున్న వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కోతను విధించడం తగదని అన్నారు. కనీస వేతన చట్టంను అమలు చేసి కూలీలకు ప్రతి రోజు రూ.600 చెల్లించాలని కోరారు. అలాగే పనిచేసే చోట కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

కులమతాలకు అతీతంగా మెలుగుదాం

గండేడ్: కులమతాలకు అతీతంగా మెలుగుదామని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి తెలిపారు. రంజాన్ మాసం సందర్భంగా బుధవారం వెన్నాచేడ్‌లో ఇచ్చిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎవరి సాంప్రదాయాలకు అనుగుణంగా వారు పండుగలు చేసుకోవడం ఆనవాయితీగా వస్తుందని, ఈ ఆచారాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల్లో ఏ పండుగలు వచ్చినా మతసామరస్యాన్ని పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో షేక్‌అలీ, గిరిధర్‌రెడ్డి, చిన్నయ్య, టైలర్‌పాష, ఖాజా, మక్బూద్, యాదయ్య, రాంలాల్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి సీపీఆర్‌పై శిక్షణ

జడ్చర్ల టౌన్: బాదేపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బుధవారం వైద్య సిబ్బంది, సాధారణ రోగుల వెంట ఉన్న వారికి సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. ఇటీవల గుండెపోటుతో ఆకస్మాత్తుగా మరణిస్తున్న వారి సంఖ్య పెరగటంతో అవగాహన కల్పిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ సోమశేఖర్ తెలిపారు. సీపీఆర్ చేయటం వల్ల ఆస్పత్రికి వెళ్లే వరకు మరణం సంభవించకుండా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు రాఘవేందర్, శ్వేత, కిరణ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



బాబు జగ్జీవన్‌రాంకు ఘన నివాళి

బాబు జగ్జీవన్‌రాం ఆశయాలను కొనసాగించాలని పలువురు వక్తలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు తెలిపారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా బాబు జగ్జీవన్‌రాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలకు, చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు.

– సాక్షి, నెట్‌వర్క్



జిల్లా కేంద్రంలో జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

- జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ మొగులప్ప జెడ్పీ హాల్‌లో చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.
- స్థానిక కలెక్టరేట్‌లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కలెక్టర్ రవినాయక్, ఎస్పీ నరసింహ, జిల్లా అడిషనల్ కలెక్టర్ సీతారామారావుతో కలిసి జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు.
- జిల్లా కేంద్రంలో వైఎస్సార్ తెలంగాణ పార్టీ నాయకులు స్థానిక తెలంగాణ చౌరస్తాలోని జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- బీసీటీఏ ఆధ్వర్యంలో స్థానిక తెలంగాణ చౌరస్తాలోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణుడు రమేష్, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తపస్ జిల్లా అధ్యక్షుడు బొల్లం సునీల్‌కుమార్ విగ్రహానికి పూలమాలలు వేశారు.
- మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పాలమూరు యూనివర్సిటీ మెయిన్ గేట్ వద్ద బాబు జగ్జీవన్‌రాం జయంతి నిర్వహించారు.
- అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తెలంగాణ చౌరస్తాలో బాబు జగ్జీవన్‌రాం విగ్రహానికి ప్రతినిధి సరోజమ్మ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.
- అడ్డాకుల మండలంలోని రాచాల పంచాయతీ వద్ద జగ్జీవన్‌రాం చిత్రపటానికి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు.
- జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డీసీసీ కార్యాలయంలో నాయకులు జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం తెలంగాణ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి నివాళులర్పించారు.
- నవాబుపేట మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం, ఎంపీపీ, తహసీల్దార్ కార్యాలయాల్లో జగ్జీవన్‌రాం జయంతిని నిర్వహించారు.
- జడ్చర్లలో మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో బాబు జగ్జీవన్‌రాం విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.
- దేవరకద్ర మండల కేంద్రంలో దళితవాడ అంబేద్కర్ భవన్ వద్ద బాబు జగ్జీవన్ రాం చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.
- మిడ్జిల్ ఎంపీడీఓ కార్యాలయంలో, అంబేద్కర్ భవనం, ప్రభుత్వ ఆస్పత్రి వద్ద చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు.
- గండేడ్, మహమ్మదాబాద్‌లో బాబు జగ్జీవన్‌రాం చిత్ర పటానికి మాజీ ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.
- హన్వాడ మండలంలోని పంచాయతీ కార్యాలయాల వద్ద బాబు జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూల మాలలు వేసి పలువురు నాయకులు ఘనంగా నివాళులర్పించారు.



మిడ్జిల్‌లో..



జిల్లా కేంద్రంలో బాబు జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న సరోజమ్మ



మహమ్మదాబాద్‌లో..



హన్వాడలో..



జెడ్పీహాల్‌లో నివాళి అర్పిస్తున్న జెడ్పీ ఉద్యోగులు



పీయూలో నివాళులర్పిస్తున్న విద్యార్థి నాయకులు



నవాబుపేట పంచాయతీ కార్యాలయంలో..



దేవరకద్రలో..

పనిచేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



కందూర్‌లో చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

అడ్డాకుల: రాష్ట్రంలో అన్ని వర్గాల కోసం పని చేసే సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కందూర్‌లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను పొందిన వారు తప్పకుండా తమ వెంట ఉండాలని కోరారు. ప్రతిపక్ష పార్టీల తప్పుడు మాటలను నమ్మొద్దని సూచించారు. అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు, దళితబంధు పథకాలను అందజేస్తామని తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రాచాల నుంచి ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు రూ.2.40కోట్లతో బీటీరోడ్డు రెన్యూవల్ పనులకు శంకుస్థాపన చేశారు. రాచాలలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన పల్లె శ్రీనివాస్‌రెడ్డిని పరామర్శించారు. గుడింబండలో రూ.20లక్షలతో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అక్కడే చిన్నచింతకుంట మండలానికి చెందిన సత్యమ్మకు మంజూరైన రూ.2.50లక్షల ఎల్‌ఓసీని అందజేశారు. తిమ్మాయిపల్లి తండాలో రూ.20లక్షలతో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కాటవరంలో హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. కందూర్ దేవాలయంలో వివిధ గ్రామాలకు చెందిన 45 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అదేవిధంగా యాదవ కమ్యూనిటీ హాలును ప్రారంభించారు.

ఆలయ కమిటీ ప్రమాణం

కందూర్ వద్ద రామలింగేశ్వరస్వామి దేవాలయంలో పాలక మండలి ప్రయాణస్వీకార కార్యక్రమం ఎమ్మెల్యే సమక్షంలో నిర్వహించారు. అధ్యక్షుడిగా రమేష్‌గౌడ్, సభ్యులుగా ప్రభాకర్‌రెడ్డి, చంద్రమౌళి, రమేష్‌యాదవ్, లక్ష్మయ్య, భువనేశ్వరి, రామకృష్ణ, రామలింగంలు ప్రమాణం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ కిషన్, విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు తిరుపతయ్య యాదవ్, భాస్కర్‌నాయుడు, కిషన్‌నాయక్, శ్రీకాంత్, జయన్నగౌడ్, భాగ్యలక్ష్మి, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, తిరుపతిరెడ్డి, రమేష్‌గౌడ్, మహిమూద్ తదితరులు ఉన్నారు.

బండిసంజయ్ అరెస్ట్‌పై బీజేపీ ఆందోళన



జిల్లా కేంద్రంలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



జడ్చర్లలో ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు



దేవరకద్రలో బీజేపీ నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

పాలమూరు: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్టును నిరసిస్తూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని క్లాక్‌టవర్ చౌరస్తాలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మచారి మాట్లాడుతూ అక్రమంగా అరెస్టు చేసిన బండి సంజయ్‌ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంజయ్య, రాజేందర్‌రెడ్డి, నారాయణయాదవ్, శివ తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్: మండల బీజేపీ నాయకులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టకుండా ఎస్‌ఐ రామ్‌లాల్‌నాయక్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం ముందు జాగ్రత్తగా వారిని అరెస్ట్ చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తిరుపతి, నరేందర్, పాండురంగారావు, రాములు, జంగయ్య ఉన్నారు.మండలంలోని కంచన్‌పల్లిలో ప్రభుత్వ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు దహనం చేశారు.

భూత్పూర్: బండి సంజయ్‌ను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని నాయకులు సుదర్శన్‌రెడ్డి, ఎగ్గని నర్సింహులు అన్నారు. బుధవారం భూత్పూర్‌లో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, హరినాథ్ గౌడ్ భీంరాజ్, చారి, నాయకులు ఉన్నారు.

జడ్చర్ల టౌన్: నియోజకవర్గ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు ధర్నా చేపట్టారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ పదో తరగతి పరీక్ష ప్రశ్నాపత్రం బయటకు రాకుండా అడ్డుకోలేని ప్రభుత్వం తమ అధ్యక్షుడిని అరెస్టు చేయటం ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రమేష్, రాజశేఖర్‌రెడ్డి, హరిబాబు, మురళీ, బుక్కనవీన్, మల్లేష్ పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో బుధవారం బీజేపీ నాయకులు రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో ఎర్ర వెంకటన్న, చంద్రన్న, గంజి వెంకన్న, దయసాగర్, సత్యం, వికాస్, రవి, వెంకటేష్ ఉన్నారు.

దేవరకద్ర: మండల కేంద్రంలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద బీజేపీ నాయకులు నిరసన దీక్ష చేపట్టారు. దీంతో పోలీసులు చేరుకుని నాయకులను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్ తరలించారు. అరెస్టయిన వారిలో జిల్లా కార్యదర్శి నారాయణరెడ్డి, అంజన్‌రెడ్డి, చంద్రశేఖర్, జితేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

హన్వాడ: మండల బీజేపీ నాయకులను పోలీసులు బుధవారం ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంతపూచికత్తుపై విడుదల చేశారు. వెంకటయ్య, రాజు, వెంకటేష్, రవి, మహేష్, మల్లేష్, ఉన్నారు.

బాలానగర్: మండల కేంద్రంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో శ్రీశైలం, వేణు పటేల్, శ్రీను పాల్గొన్నారు.

ఎస్సీ జాబితాలో చేర్చే వరకు పోరాటం

జడ్చర్ల టౌన్: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే వరకు పోరాటం కొనసాగిస్తామని రజక రిజర్వేషన్ సమితి జాతీయ కన్వీనర్ నడిమింటి శ్రీనివాస్ అన్నారు. బుధవారం పట్టణంలోని రజకభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీలు రజకులను ఎస్సీ జాబితాలో చేరుస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే విస్మరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకుచ్చేలా రజక రిజర్వేషన్ సమితి పటిష్టం చేసేందుకు కమిటీలు వేస్తున్నట్లు ప్రకటించారు. సమితి నియోజకవర్గ అధక్షునిగా మిద్దె శ్రీకాంత్‌ను నియమిస్తూ నియామక పత్రం అందజేశారు.

అయ్యప్ప కొండపై మహాపడిపూజ



మహమ్మదాబాద్: మండల కేంద్రంలోని అయ్యప్ప కొండ కాంతిమల శిఖరంపై బుధవారం అయ్యప్ప జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకం, మహాపడిని వెలిగించారు. అయ్యప్ప నామస్మరణతో కాంతిమల శిఖరం మార్మోగింది. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే టీ.రామ్మోహన్‌రెడ్డి, శాంతీబాయి, రాములు, ఆలయ కమిటీ నిర్వాహకులు అనంతయ్యగుప్త, గోపాల్, చెన్నయ్య, లక్ష్మికాంత్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రశ్నిస్తున్న నాయకులను అరెస్ట్ చేయడం సరికాదు

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్రంలో పదో తరగతి పరీక్ష పేపర్ లీకేజీలపై ప్రశ్నిస్తున్న ఎన్‌ఎస్‌యూఐ నాయకులను అరెస్టు చేయడం సరికాదని రాష్ట్ర కార్యదర్శి ముకుందం రమేష్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పదో తరగతి పరీక్ష పేపర్ లీకేజీల విషయంలో బోర్డును ముట్టడించిన ఎన్‌ఎస్‌యూఐ నాయకులపై ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విద్యారంగ నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సమావేశంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, ఫహీం, చంద్రమౌళి, అన్ను తదితరులు పాల్గొన్నారు.

నేడు మాంసం దుకాణాలు బంద్



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గురువారం జిల్లా కేంద్రంలో మాంసం, చికెన్, చేపల దుకాణాలు తెరవొద్దని మున్సిపల్ అధికారులు ఆదేశించారు. ఈ మేరకు బుధవారం పట్టణంలో ఆయా షాపులను సిబ్బంది తిరిగి వ్యాపారులకు నోటీసులు అందజేశారు.

వర్షాకాలంలోగా పూర్తి చేయండి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో మినీ ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్డు, సస్పెన్షన్ బ్రిడ్జి, ఐలాండ్ పనులను త్వరగా పూర్తి చేయాలని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. బుధవారం పెద్దచెరువు వద్ద పనులను కలెక్టర్ రవి నాయక్, ఎస్పీ నర్సింహాతో కలిసి తనిఖీ చేశారు. మంత్రి మాట్లాడుతూ ఐలాండ్‌ను గట్టి మొరం, మట్టితో నింపాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వర్షాకాలంలోపే అన్ని పనులు పూర్తి కావాలన్నారు. 2014 నుంచి ఇప్పటివరకు మినీ ట్యాంక్‌బండ్ పరిస్థితిపై వీడియోగ్రాఫీ చేయించాలని ఇరిగేషన్ ఎస్‌ఈ చక్రధర్‌కు సూచించారు. పెద్దచెరువులోకి పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నీటితో నింపేందుకు అబ్దుల్ ఖాదర్ దర్గా వైపు అలాగే జడ్చర్ల వైపు నుంచి వచ్చే పైపులైన్లు ముందే సిద్ధం చేయాలన్నారు. వర్షపునీటిని, మురుగును నాలాల ద్వారా బయటకు పంపించేందుకు వెంటనే ప్రణాళిక రూపొందించాలన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు

జడ్చర్ల: పట్టణంలో నిర్మించిన వంద పడకల ఆస్పత్రిని నెలాఖరు లోగా ప్రారంభిస్తామని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ఆస్పత్రిని పరిశీలించారు. ఈ ఆస్పత్రితో ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని తెలిపారు. అనంతరం అంబేద్కర్ భవనాన్ని పరిశీలించారు. మండలంలోని నసరుల్లాబాద్‌లో రైతువేదికను ప్రారంభించారు. ఉచిత విద్యుత్, సాగునీరు కారణంగా వ్యవసాయం పండుగలా సాగుతుందన్నారు. ఇటీవల మృతి చెందిన రైతు తిరుపతి కుటుంబానికి రైతు బీమా కింద రూ.5లక్షల చెక్కును అందజేశారు. అదేవిధంగా రజకసంఘం భవనానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, సర్పంచ్ ప్రణీల్‌చందర్ తదితరులు పాల్గొన్నారు.

హామీలతో మభ్యపెడుతున్న బీఆర్‌ఎస్



గుండ్లపొట్లపల్లిలో మహిళలతో మాట్లాడుతున్న అనిరుధ్‌రెడ్డి తదితరులు

రాజాపూర్: అమలు కాని హామీలను ఇచ్చి ప్రజలను మళ్లీ మభ్యపెట్టేందుకు చూస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని టీపీసీసీ కార్యదర్శి జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గుండ్లపొట్లపల్లి, అగ్రహారం పొట్లపల్లి, ఈద్గాన్‌పల్లి, మల్లేపల్లిలో హాథ్ సే హాథ్ జోడో జడ్చర్ల జోడో యాత్రను నిర్వహించారు. రైతులకు సీఎం కేసీఆర్ రూ.లక్ష రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి మరిచారన్నారు. ఏ గ్రామంలో చూసిన రుణమాఫీ ప్రభుత్వం చేయకపోవడంతో రైతులు బ్యాంకు తీసుకున్న అప్పు రెండింతలైందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఏకకాలంలో రూ.2లక్షల రుణాన్ని మాఫీ చేస్తామని ప్రకటించామని ఆయన ప్రజలకు వివరించారు. బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి అంతా ఒక్క కేసీఆర్ కుటుంబానికి పరిమితమైందన్నారు. కార్యక్రమంలో కృష్ణయ్య, శ్రీనివాస్‌నాయక్, వెంకటయ్య, రమేష్ పాల్గొన్నారు.

కాటవరంలో గడప గడపకు కాంగ్రెస్

అడ్డాకుల: మండలంలోని కాటవరంలో హాథ్‌సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా బుధవారం రాత్రి గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ మ్యానిఫెస్టోను ప్రచారం చేశారు. కార్యక్రమంలో వేణుగోపాల్, టీసీ శ్రీనివాస్, నరోత్తంరెడ్డి, గోవుల బాలరాజు, ఆంజనేయులు, ఎల్లగౌడ్, దేవోజీ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మోదీ విధానాలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు

దేవరకద్ర: మోదీ విధానాలు ప్రజాస్వామ వ్యవస్థకు గొడ్డలిపెట్టు లాంటివని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్ ఆరోపించారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డులో నిర్వహించిన సీపీఐ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో బీజేపీ ప్రభుత్వ అధికారంలోకి వచ్చాకా దేశ సార్వభౌమాధికారం, ప్రజాస్వామ్య విలువలు ప్రమాదంలో పడ్డాయని అన్నారు. రాజ్యాంగ మూల సూత్రాలను విధ్వంసం చేస్తు సంఘ్ పరివాహక ఎజెండా, మనుధర్మ పాలసీని పాలన రాజకీయ రంగాల్లో బలవంతంగా చొప్పిస్తున్నారని అన్నారు. ప్రజల మధ్య తీవ్ర మత విద్వేశాలను రెచ్చగొడుతూ పాలన సాగిస్తున్నారని తెలిపారు. లాభాల బాటలో పయనిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను పనిగట్టుకుని నిర్వీర్యం చేస్తు ప్రైవేట్ పరం చేస్తున్నారన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నిరుద్యోగుల ఉసురు తీస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కేసీఆర్ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను నేరవేర్చాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని కోరారు. ఈ నెల 14 నుంచి మే 14 వరకు సీపీఐ ఆధ్వర్యంలో పోరుజాత కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రజలను చైతన్య పరుస్తామని తెలిపారు. సమావేశంలో సురేష్, దేవదానం, అరుణ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నియోజకవర్గ కన్వీనర్‌గా అమరజ్యోతి, కో కన్వీనర్‌గా మాషప్ప, మాసన్న, మోహన్‌నాయక్, కౌన్సిల్ సభ్యులుగా రవీందర్, శ్రీను, శ్రీకాంత్‌ను ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి బాలకిషన్

కల్వర్టును ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

గండేడ్: స్కూటీ అదుపు తప్పి కల్వర్టును ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే మండలంలోని సల్కర్‌పేట్‌కు చెందిన మాలె శ్రీనివాస్ బుధవారం సాయంత్రం స్కూటీపై కోస్గి వెళ్లి తిరిగి ఇంటికి బయలుదేరాడు. రంగారెడ్డిపల్లి సమీపంలో స్కూటీ అదుపుతప్పి పక్కనే ఉన్న కల్వర్టుకు తగిలి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.